
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
3
సోమవారం 8 ఏప్రిల్ 2024
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్: 4.42 (మంగళవారం)



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.178	258	294
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.0 | కనిష్ఠం 25.0

ప్రజాసంఘాలు ఎవరివైపో?

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలతో చర్చలు షురూ
- భువనగిరి నుంచి ఇద్దరు బీసీలు, మైనార్టీ, ఒకరు ఓసీ
- నల్లగొండ నుంచి ముగ్గురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే



లోక్‌సభ ఎన్నికల సమరానికి అన్ని ప్రధాన పార్టీలు సంసిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు ప్రజాసంఘాల మద్దతు ఎవరికి ఉంటుందన్న అంశంపై చర్చ మొదలైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలతో చర్చించి తమకే మద్దతు పలకాలని పార్టీ అధిష్ఠానాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే ఆయా సంఘాలు ఎవరికి మద్దతిస్తాయోనన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ, ఓటర్ల మద్దతు కూడగట్టుకునే పనిలో పార్టీలు ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)


లోక్‌సభ ఎన్నికలను అన్నిపార్టీలూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థానాల బరిలో బీసీలకు స్థానం కల్పించాలని పలు సంఘాలు అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశాయి. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్‌నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డిని, బీఆర్ఎస్ తరఫున కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థులుగా అధిష్ఠానాలు ప్రకటించాయి. భువనగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్, సీపీఎం తరఫున ఎండీ జహంగీర్‌ను ప్రకటించాయి. రాష్ట్రంలో 17 నియోజకవర్గాలకు ఒక్క భువనగిరిలోనే సీపీఎం పోటీలో ఉంది. మిగతా నియోజకవర్గాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్న అంశంపై పార్టీలో చర్చ సాగుతున్నట్లు తెలస్తోంది. అయితే భువనగిరిలో ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్ మినహాయించి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం(మైనార్టీ)లు బీసీ సామాజికవర్గానికి చెందిన వారికి టికెట్లు ఇచ్చాయి. నల్లగొండ నియోజకవర్గంలో మాత్రం ముగ్గురు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి మధ్య పోటీ నెలకొంది. భువనగిరిలో ముగ్గురు బీసీలు, ఒక ఓసీ మధ్య రసవత్తరమైన పోటీ ఉండనుంది. అయితే మూడు పార్టీలకు చెందిన అభ్యర్థులను బీసీలను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో బీసీసంఘాల నేతలు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న అంశంపై ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. భువనగిరి నియోజకవర్గంలో మైనార్టీ ఓటర్లు ఎవరి వైపు ఉంటారన్నది కూడా పార్టీ అధిష్ఠానాల్లో కలవరం మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సామాజిక కోణంలో అన్ని పార్టీలు తమ వైపు ఓటర్లను తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.

బీఎస్పీ పోటీల్లో ఉన్నట్టా.. లేన్నట్టా..?

నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో లోక్‌సభ ఎన్నికల బరిలో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) పోటీలో ఉంటుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల బీఆర్ఎస్‌లో చేరి నాగర్‌కర్నూల్ నియోకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. అయితే ఆయన మొదటి నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా వేదికగానే రాజకీయాలు ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో మాత్రం బీఎస్పీ అభ్యర్థులపై ఎలాంటి చర్చలేదు. త్వరలోనే రాష్ట్ర కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఈ ఎన్నికల్లో పోటీలో ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేస్తే బాగుంటుందన్న అంశంపై చర్చించనున్నారు. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నేతల నుంచి వివరాలు సేకరించనున్నారు. పల్లెలు, పట్టణాల్లో బీఎస్పీ తరఫున ప్రచారాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో ఎస్సీ, బీసీ ఓటర్లు అధికంగా ఉన్నందున, ఎన్నికల బరిలో బీఎస్పీ తరఫున బీసీ నేతలను రంగంలోకి దింపాలని యోచిస్తున్నారు. త్వరలో పార్టీ అభ్యర్థిని ప్రకటించి, నామినేషన్ వేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

టీడీపీని బలోపేతం చేసేందుకు..

తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. అయితే పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉండాలా? లేదా? అన్న దానిపై అధిష్ఠానం నిర్ణయం కోసం స్థానిక నేతలు వేచి చూస్తున్నారు. ఈ మేరకు పార్టీ ముఖ్యనేతలతో సమావేశాన్ని నిర్వహించి, తాజా పరిస్థితులపై చర్చించారు. గతంలో నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉండేది. ఎంపీగా కూడా గెలుపొందారు. అయితే ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టి, తమ సత్తా ఏమిటో తేల్చుకుందామని పలువురు నేతలు అధిష్ఠానంతో చర్చలు జరిపారు.



స్థానిక పరిస్థితులను బట్టి పార్టీ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అయితే టీడీపీ అభిమానులు, సానుభూతిపరులు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారన్న అంశంపై నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది.

బీజేపీలోకి రేపు రామరాజు!

రాజకీయ భవిష్యత్‌పై హామీ ఇచ్చిన బీజేపీ కీలకనేతలు

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసిన రామరాజు



నల్లగొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ నేత పిల్లి రామరాజు యాదవ్ బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 9న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏఐఎఫ్‌బీ అభ్యర్థిగా బరిలో దిగిన ఈయనకు 27వేల ఓట్లు దక్కాయి. ఇటీవల కార్యకర్తలతో రామరాజు నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో త్వరలో కీలక పార్టీలో చేరబోతున్నానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈయన కాంగ్రెస్‌లోకి వెళతారనే ప్రచారం సాగినప్పటికీ, ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఇదే సమయంలో జిల్లాలో బలమైన ఓటుబ్యాంకు కలిగిన నేతలను తమవైపు తిప్పుకుంటున్న బీజేపీ నాయకులు, రామరాజుతో చర్చలు జరిపారు. పార్టీలో చేరితే రాజకీయ భవిష్యత్ ఉంటుందని, కీలకమైన అవకాశాలు కల్పించేందుకు బీజేపీ కీలకనేతలు హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య తదితరులు ఆదివారం రామరాజు యాదవ్‌ని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి పరిచయం చేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరితే భవిష్యత్ ఉంటుందని, రాజకీయంగా అనుకున్న లక్ష్యం చేరేందుకు తోడ్పాడునందిస్తామని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా రామరాజుకు హామీ ఇవ్వగా, పార్టీలో చేరేందుకు రామరాజు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 9న తన అనుచరగణంతో హైదరాబాద్ వెళ్లి బీజేపీలో చేరనున్నట్లు రామరాజు యాదవ్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

చోరీల నివారణకు ప్రత్యేక బృందాలు: ఎస్పీ



చందనా దీప్తి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 7: జిల్లాలో దొంగతనాల నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అన్ని ప్రాంతాలల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎండకాలం సమీపిస్తున్న తరుణంలో పాఠశాలలకు సెలవులు ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు దొంగతనాలు జరగకుండా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాలు, కాలనీలు, దుకాణాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు.

ఎన్నికల నేపథ్యంలో గ్రీవెన్స్ డే రద్దు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకూ గీవెన్స్‌డే నిర్వహించడం జరగదని స్పష్టంచేశారు. ప్రజలు దీనిని దృష్టిలో ఉంచుకుని వినతులు సమర్పించేందుకు సోమవారం ఎస్పీ కార్యాలయానికి తరలిరావొద్దని కోరారు.

వ్యక్తిగత ప్రచార పోస్టర్లను విడుదల చేయవద్దు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తప్పుడు ప్రచారాలతో కూడిన అభ్యర్థులు వ్యక్తిగత ప్రచార పోస్టర్‌లను విడుదల చేయవద్దని ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

గ(డ్డి)డ్డు పరిస్థితి



మిర్యాలగూడ మండలంలో తేమ లేకుండా ఆరేందుకు పొలంలో ఏర్పాటు చేసిన పశుగ్రాసం కట్టలు



ట్రాక్టర్ ద్వారా కొండమల్లేపల్లికి గడ్డిని తరలిస్తున్న రైతులు

- పశుగ్రాసం లేక మూగజీవాల రోదన
- రోజురోజుకూ పెరుగుతున్న పశుగ్రాసం ధర
- జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌కు తరలింపు

మిర్యాలగూడ, ఏప్రిల్ 7: కరువుతో పంటల దిగుబడి తగ్గినట్లే పశుగ్రాసానికీ కొరత ఏర్పడింది. దీంతో మూగజీవాలు రోదిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతోపాటు కృష్ణా, గోదావరి, డిండి పరివాహక ప్రాంతాల్లో వరిసాగు గణనీయంగా తగ్గింది. వానాకాలంలో నీటి లభ్యత అంతో ఇంతో ఉన్న రైతులు కొంతమేర పంట సాగు చేశారు. పంట చేతికందడంతో ఎలాగోలా రెండో పంట కూడా సాగవుతుందన్న ఆశతో తిరిగి యాసంగిలో బోరు బావుల కింద వరినాట్లు వేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో తాగునీటి అవసరాలకు మాత్రమే నీటి లభ్యత ఉండటంతో అధికారులు వేసవిలో క్రాప్‌హాలిడే ప్రకటించారు. వానాకాలం లాగా పంటలు సాగవుతాయని ఆశించిన రైతులు మొదటి పంటకంటే 30-40 శాతం విస్తీర్ణం తగ్గించి సాగు చేసినప్పటికీ భూగర్భ జలాలు తగ్గి అనేక మంది రైతులు పంటను కోల్పోయి ఆర్థికంగా నష్టపోయారు. సాగర్ జలాశయంలో నీరు అడుగంటడంతో తాగునీటి అవసరాలకు మాత్రమే కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయడంతో వేలాది ఎకరాల్లో పంటలు కోయకుండానే వదిలేయాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. రెండు సీజన్లలో రైతులు వరి పంట అంతంత మాత్రమే సాగు చేయడంతో పశువుల మేతకు కొరత ఏర్పడుతోందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొరత కారణంగా రోజురోజుకూ ఎండుగడ్డి ధర పెరుగుతూ వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంట నూర్పిడి ప్రారంభమైన మొదట్లో గడ్డి మోపు(15-18కిలోలు) రూ.60 నుంచి రూ.70లకు విక్రయించగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90లకు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రైతుల వద్ద పశుగ్రాసం కొనుగోలు చేసిన దళారులు లారీలు, ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి దూరాన్ని బట్టి రూ.120 నుంచి 140 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

వరి కోతలకు ముందే అడ్వాన్స్

దక్షిణ తెలంగాణలో వరిపంట సాగులో ఉమ్మడి నల్లగొండ జిల్లా ముందు వరుసలో ఉంటుంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో డెయిరీఫామ్‌ల నిర్వాహకులు పాడి ఆవులు, గేదెలకోసం జిల్లాలో వరిసాగు చేసే రైతులకు పశుగ్రాసంకోసం ముందుగానే అడ్వాన్స్‌లు కూడా చెల్లించినట్లు తెలుస్తోంది. పశుగ్రాసం కట్టకు రూ.60 చొప్పున ధర కుదుర్చుకుని తమకే విక్రయించేట్లు కొంత అడ్వాన్స్ కూడా చెల్లిస్తున్నట్లు సమాచారం. మరికొందరు దళారులు రైతులు పంట కోయగానే ఎకరానికి రూ.1000 నుంచి రూ.1500 వరకు చెల్లించి వారే గడ్డిని కట్టలు కట్టించి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు వాహనాల్లో తరలించి దూరాన్ని బట్టి రవాణా చార్జీలు కలిపి కట్టను రూ.120 నుంచి రూ.140వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరానికి 40 నుంచి 60 కట్టల గడ్డి లభ్యమవుతోందని అంటున్నారు. వరికోత టైర్ల మిషన్ కంటే చైన్‌మిషన్‌తో చేయిస్తే పశుగ్రాసం ఎక్కువ ముక్కలై తక్కువ పశుగ్రాసం వస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కాగా కోతల సమయంలో ధాన్యం నేలపై పడుతుందనే కారణంతో వరిని సగానికే కోయడంతో మరింత పశుగ్రాసం తక్కువగా వస్తోందంటున్నారు. అయితే నల్లగొండ మండలం ముశంపల్లి, గుట్టకింద అన్నారం రైతుల నుంచి శ్రీశైలం నుంచి వచ్చిన వ్యాపారులు పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. స్థానిక దళారులు నేరుగా రైతుల వద్ద కొనుగోలుచేసి గుంటూరు, మాచర్ల వారికి విక్రయిస్తున్నారు. దీంతో పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్‌తో ధరలు పెంచుతున్నారని అంటున్నారు.

యంత్రాల వల్ల 30శాతం మేర గడ్డి వృథా

గతంలో మాదిరి వరి కోతలకు కూలీలు అందుబాటులో లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు సైతం వరికోతలకు యంత్రాలనే వినియోగిస్తున్నారు. దీనివల్ల వరి మొక్క మధ్యలోనే కోయడంతో అడుగు భాగంలో గడ్డి సుమారు 30శాతం వృథా అవుతోంది. నల్లగొండ జిల్లాలో ఆవులు 2.06 లక్షలు, గేదెలు 3.37లక్షలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆవులు 69వేలు, గేదెలు లక్షా 22వేలు, సూర్యాపేట జిల్లాలో 52 వేలు ఆవులు, 1.87లక్షలు గేదె సంతతికి చెందిన పశువులు ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్, యాసంగి సీజన్లలో వరి సాగు విస్తీర్ణం 60శాతానికి పైగా తగ్గిపోవడంతో ముగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీనికితోడు ఇతర రాష్ట్రాలనుంచి ఎండు గడ్డికోసం జిల్లాకు వస్తుండటంతో ట్రాక్టర్ గడ్డికి రూ.10వేల నుంచి రూ.12వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని పశు పోషకులు వాపోతున్నారు.

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీల్లో వేసిన వరి పొలాలు ఎండిపోవడంతో పశువులకు గ్రాసం లేకుండా పోయింది. పశువులు ఉన్న రైతులు గడ్డిని విక్రయించాలంటే గడ్డి కొరత ఏర్పడి, ఉన్న కొద్దిపాటి పశుగ్రాసానికి డిమాండ్ బాగా పెరిగింది. మండలంలో గడ్డి లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి.. నల్లగొండ సమీపంలోని దర్వేశిపురం, కనగల్ చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవరకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తరలిస్తున్నారు.

ట్రాక్టర్ గడ్డికి రూ.10వేల నుంచి రూ.12వేలు

తీవ్ర పశుగ్రాసం కొరత నెలకొన్న ప్రస్తుత తరుణంలో గ్రాసానికి డిమాండ్ అమాంతం పెరిగింది. ఒక్కో గడ్డి కట్టకు రూ.130నుంచి రూ.150వరకు వెచ్చిస్తున్నామని రైతులు పేర్కొంటుండగా ఒకట్రాక్టర్ పశుగ్రాసానికి మాత్రం రూ.10వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. దీనికితోడు దూర ప్రాంతాలనుంచి పశుగ్రాసాన్ని తీసుకొచ్చేందుకు అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో పశువుల పోషణ భారంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు పశుగ్రాసాన్ని కొనుగోలు చేయలేక పశువులను విక్రయిస్తున్నారు. ముున్ముందు పశుగ్రాసం ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉండడంతో పశుపోషణ రైతులకు మరింత భారం కానుంది.

పోషణ భారమై పశువుల విక్రయం



సబ్సిడీపై పశుగ్రాసం సరఫరా చేయాలి



ఆయకట్టుకు సాగునీరు విడుదల లేనందున మా వ్యవసాయ భూమి బీడుగానే ఉంది. వ్యవసాయానికి తోడు ఏడు గేదెలను పెంచుతూ కుటుంబ పోషణ సాగిస్తున్నాను. కరువు వల్ల గడ్డి పశువుల దాణా ఖర్చులు పెరిగిపోవడంతో పాడి కూడా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. గతంలో రూ.90 నుంచి రూ.100కు గడ్డి కట్ట విక్రయించగా, ప్రస్తుతం రూ.130 నుంచి రూ.140వరకు అమ్ముతున్నారు. పాడి పశువులను కాపాడుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం సరఫరా చేయాలి. పచ్చిమేత కోసం సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేసినట్లయితే పశుగ్రాసం కొరత తీరడంతోపాటు పాడిని సంరక్షించు కోగలుగుతాం.

- గోర్ల శ్రీను, తిరుమలగిరి (సాగర్)

పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడింది



కొండమల్లేపల్లి మండలంలో తాగడానికి నీరు లేక, వ్యవసాయ బోర్లు ఎండిపోయి పశుగ్రామానికి తీవ్ర కొరత ఏర్పడింది. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో పశువులకు మేత లేకపోవడంతో వాటిని అమ్మేస్తున్నాం. ఇన్ని రోజులు పోషించుకున్న పశువులను అమ్మాలంటే మనస్సు ఒప్పడం లేదు.

- బి.రమేశ్, రైతు, కొండమల్లేపల్లి

'రైతుబంధు'పై ఇవేమి లెక్కలు ?

- ఐదెకరాలు దాటకపోవడంపై పెదవి విరుపు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం
- జిల్లాలో తాగునీటి ఎద్దడిపై సుదీర్ఘ చర్చ
- ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లదే ఇష్టారాజ్యం అంటూ ఆరోపణలు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై వాడివేడిగా చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ,ఏప్రిల్ 7: జిల్లాలో రైతుబంధు ముందుకు సాగకపోవడం.. ఇంకా ఐదు ఎకరాలకు మించి పెట్టుబడి సాయం అందించకపోవడంతోపాటు తాగునీటి సమస్యపై అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై జిల్లా సర్వసభ్య సమావేశంలో వాడివేడి చర్చ సాగింది. ఆదివారం జడ్పీ హాల్‌లో చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగింది. సమావేశం ప్రారంభం తర్వాత జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సాగర్ నుంచి నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరుకు సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటిని తరలించుకుపోతున్నారని సభ్యులు అభ్యంతరం తెలిపారు. జిల్లా సాగు, తాగునీటి అవసరాలను అధికారులు పక్కనబెట్టి పక్క జిల్లాకు నీటిని విడుదల చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్ లేకుండానే సమావేశాన్ని ఎలా నిర్వహిస్తున్నారని, కలెక్టర్ సమావేశానికి హాజరైతే తమ సమస్యలు చెప్పుకుంటాం కదా అంటూ పలువురు సభ్యులు ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకంలో అనేక సమస్యలు ఉన్నాయని, చాలా చోట్ల పైపులైన్ లేకపోవడంతో నీటి సరఫరాకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ సమయంలో అధికారులు స్పందిస్తూ జూన్, జూలై వరకు కూడా తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేవని, వివిధ రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

రైతుబంధు సాయం ముందుకు సాగదా?

రైతుబంధు సాయం ముందుకు సాగకపోవడంపై పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష సందర్భంగా రైతుబంధు సాయం ఎన్ని ఎకరాల వరకు రైతుల ఖాతాలో జమయిందని జేడీఏ శ్రవణ్‌కుమార్‌ను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంఖ్య, జమయిన నగదు వివరాలు మాత్రమే ఉంటాయని, ఎన్ని ఎకరాల వరకు ఖాతాల్లో జమైందనేది సమాచారం ఉండదని తెలిపారు. ఈ సమయంలో జడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి ఎన్ని ఎకరాలకు రైతుబంధు అందిందనేది తెలియకపోతే ఎలా అని అడిగారు. ఈ సమయంలో పలువురు సభ్యులు ఇదే విషయంపై జోక్యం చేసుకున్నారు. దీంతో ఒకానొక సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయాన్నినిరంతరం జమ చేస్తుందన్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఈ వివరాలు ఉంటాయన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని, అందరికీ రైతు బంధు సాయం వస్తుందన్నారు. జడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తిరిగి ఇదే విషయంపై మాట్లాడుతూ త్వరగా రైతుబంధు సాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.



రైతుబంధుపై పాశం రాంరెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి మధ్య వాగ్వాదం

మిల్లర్లను కట్టడి చేయాలని సభ్యుల డిమాండ్

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. మహేంద్ర చింట్లు, కావేరి చింట్ల విషయంలో గందరగోళం నెలకొందన్నారు. మహేంద్ర చింట్లు దొడ్డుగా, కావేరి చింట్లు సన్నగా ఉంటున్నాయి అంటున్నారని, రైతులకు కనీస ధర చెల్లించకుండా మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయడంతోపాటు మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. మిర్యాలగూడ, దేవరకొండ ప్రాంతాల్లో ధాన్యం దిగుబడులు పెద్దగా లేనందున్న తక్కువ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 12వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. చండూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక జడ్పీటీసీ ఆరోపించారు. పశుసంవర్ధశాఖకు చెందిన 1000 గజాల స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్ముకున్న కానీ అధికారులు స్పందించడం లేదన్నారు. అప్పటి కలెక్టర్ ఆదేశాలమేరకు ఆర్డీవో ఎంక్వయిరీ పూర్తి అయినా పట్టింపు లేదన్నారు.

వెంచర్లు ఇష్టారాజ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు, మునిసిపాలిటీ అధికారులు దాంతో తనకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. వడదెబ్బల నివారణకోసం వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన వాల్ పోస్టర్‌ను సమావేశంలో ఆవిష్కరించారు. వడదెబ్బకు గురికాకుండా జిల్లావ్యాప్తంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని అధికారులు చెప్పారు. సమావేశంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సన్‌డే

- పెరుగుతున్న ఉష్ణోగ్రలతో జనం బెంబేలు
- ఉమ్మడి జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



నల్లగొండ, ఏప్రిల్ 7: భానుడి ప్రతాపం కొనసాగుతూనే ఉంది. ఆదివారం కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమికి ప్రజలు బయటకు రావడంలేదు. దీంతో ప్రధాన రోడ్లతోపాటు కూడళ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరి కొండపై ఎండవేడిమితో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి జిల్లాలో ఆదివారం అత్యధికంగా నిడమనూరు మండలం, అనంతగిరి మండలం శాంతినగర్ 44.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో అత్యధికంగా 44.5 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలంలో గొడకండ్ల 40.0 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజి లాపురంలో 43.4 డిగ్రీలు, రాజాపేట మండలం పాముకుంటలో అత్యల్పంగా 40.0 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 ప్రాంతాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నల్లగొండ జిల్లాలో ఆరెంజ్ అలర్ట్

నల్లగొండ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. నిడమనూరు మండలంలో 44.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో పగటి ఉష్ణోగ్రత పెరగడంతో వాతావరణశాఖ నల్లగొండ జిల్లాను ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించింది. 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైతే ఆరెంజ్ అలర్ట్‌గా గుర్తిస్తారు. 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదైతే హెచ్చరికగా ప్రకటిస్తారు.



నిత్యం రద్దీగా ఉండే నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్ ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా ఇలా..

చిట్యాలలో గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

చిట్యాల, ఏప్రిల్ 7 : గంజాయిని రవాణా విక్రేతలను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారంతో ఆదివారం చిట్యాలలో వాహనాల తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి వైపు బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని ఆపి ప్రశ్నించామన్నారు. పారిపోవడానికి ప్రయత్నించడంతో పట్టుకుని విచారించగా నల్లగొండ మండలం పానగల్‌కు చెందిన కొడిదల జగదీష్, కొడిదల అంజి, చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన రూపని నితిన్‌గా చెప్పారన్నారు. వారు హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలు చేసి చిట్యాలలో విక్ర యిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3 వేల విలువైన 150 గ్రాముల గంజాయితో పాటు మోటారుబైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సన్ డే

భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు.. ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. 44 డిగ్రీలకు పైగా నమోదు కావడంతో పాటు వడగాడ్పులు వీస్తుండటంతో బయటకు రావాలంటేనే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వేడుగాలులకు అల్లాడిపోతూనే ఉన్నారు. చాలామంది నీడపట్టున ఉండటంతో పాటు బయటకు వెళ్లేప్పుడు ఎండవేడిమి పడకుండా వస్త్రాలను కప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. బయటకు వెళ్లిన వారు శీతలపానీయాలు తాగుతూ కొంతమేర ఉపశమనం పొందుతున్నారు.





నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఉదయసముద్రం ప్రాజెక్టు వద్ద సంపులో సేదతీరుతున్న యువకులు, చిన్నారులు



నీళ్లు లేక బోసిపోయిన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఉదయసముద్రం ప్రాజెక్టు





తుంగతుర్తి మండలం అనంతారంలో నిమ్మతోటకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్న రైతు, నిర్మానుష్యంగా యాదాద్రిభువనగిరి జిల్లా రాయగిరి వద్ద గుట్టకు వెళ్లే మార్గం



తాటిచెట్టుపై తాటిఊటను తాగుతున్న రామచిలక





వస్త్రాలు నెత్తిన కప్పుకుని ఎండనుంచి జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణిస్తున్న ప్రజలు





పండ్ల రసాల దుకాణాల వద్ద రద్దీ



వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కుండలు, కూలర్లు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ప్రజలు

రూ.7.69 లక్షలు స్వాధీనం

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల నల్లగొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వేర్వేరు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.7,69,500లను స్వాధీనం చేసుకున్నారు.



దేవరకొండలో నగదును స్వాధీనం చేసుకుంటున్న సీఐ నర్సింహులు

● **దేవరకొండ, ఏప్రిల్ 7:** దేవరకొండలో ఆదివారం వాహనాలను తనిఖీచేసి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాహనాలలో తరలిస్తున్న రూ.4,84,500 నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లా ఇప్పలపల్లి గ్రామానికి చెందిన హనుమంతు వద్ద నుంచి రూ.లక్షా 20,500, వనపర్తి జిల్లా పానగల్లు గ్రామానికి చెందిన కుర్మయ్య నుంచి రూ.లక్షా 12వేలు, నల్లగొండకు చెందిన శంకరయ్య వద్ద నుంచి రూ.లక్షా 2వేలు, చందంపేట మండలం పోలేపల్లికి చెందిన బాలు వద్ద నుంచి రూ.50వేలు, ముదుదండ్ల గ్రామానికి చెందిన శీను వద్ద నుంచి రూ.50వేలు, నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటకు చెందిన స్వామి వద్ద నుంచి రూ.50వేల నగదును పట్టుకొని పంచనామా అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేసినట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

● చింతపల్లి మండలం గొడుకొండ్ల వద్ద వాహనాలను తనిఖీలు నిర్వహిస్తుండగా ఆధారాలు చూపించకుండా తరలిస్తున్న రూ.70వేల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాకు చెందిన సుబ్బారావు తన వాహనంలో రూ.70వేలను హైదరాబాద్‌కు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు.

● కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో వాహనాల తనిఖీల్లో ఇరువురి నుంచి రూ.2.15లక్షలు సీజ్ చేసినట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిఆరు. గుడిపల్లి నుంచి మాల్ పట్టణానికి వెళ్తున్న నిమ్మరాజు సత్తయ్య నుంచి రూ.1.45లక్షలు, అలాగే గుడిపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మినహాజుద్దీన్ నుంచి రూ.70వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలలో సిబ్బంది రాము, ఏడుకొండలు, బాలాజి తదితరులున్నారు.

● మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాప్‌పై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 40బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సదరు నిర్వాహకుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



గుంజలూరు గ్రామంలో గృహలక్ష్మి పథకంలో మంజూరై తమ సొంత నిధులతో నిర్మించుకుంటున్న ఇళ్లు

'గృహలక్ష్మి'పై ఆశతో..

అప్పులపాలయ్యారు

చివ్వెంల, ఏప్రిల్ 7 : నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనయనే సామెతకు సరిగ్గా సరిపోయేలా ఉంది గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల పరిస్థితి. ఎన్నికల సమయంలో నోటిఫికేషన్‌కు ముందు హడావిడిగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతీ ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు మూడు విడతల్లో ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఆదరాబాదరాగా లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందజేసింది. వెంటనే శంకుస్థాపనలు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు హడావుడి చేయడంతో లబ్ధిదారులు పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నిధులు విడుదలకాలేదు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసింది. అయితే ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు ఇంటి పనులు మొదలు పెట్టడంతో చేసేదేమీ లేక అప్పులు తెచ్చి నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారు. గతంలో ఉన్న ప్రజాప్రతినిధుల మాటలను నమ్మి మోసపోయామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పార్టీలతో సంబంధం లేకుండా గృహలక్ష్మి పథకంలో ఎంపికైన లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయాలని స్థానిక నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు. కొంతమంది నాయకుల మాటలకు తొందరపడకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు.

- » గత ప్రభుత్వ పథకం రద్దు
- » పనులు ప్రారంభించిన లబ్ధిదారులు లబోదిబో
- » వారికి ఎటువంటి సాయం అందిస్తారనేది ప్రశ్నార్థకం

మండల వ్యాప్తంగా 549 మంది లబ్ధిదారులు ఎంపిక

గృహలక్ష్మి పథకంలో భాగంగా గత ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, అప్పుడున్న స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చివ్వెంల మండల వ్యాప్తంగా 549 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామానికి 10 నుంచి 20 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందజేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టే క్రమంలో మొదటగా పంచాయతీరాజ్ ఏఈ పరిశీలన అనంతరం ఎంపీడీవో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాత కలెక్టర్‌కు ఆన్‌లైన్ ద్వారా వివరాలు, వారి ఫొటోలను పంపిస్తే అప్పుడు ప్రభుత్వం నుంచి నగదు అందాల్సి ఉంది. లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టిన కొద్దికాలానికే అంతా ఎలక్షన్ హడావుడిలో అధికారులు ఉండడంతో లబ్ధిదారుల పనులను గుర్తించిందీ లేదు, ఆన్‌లైన్ చేసిందీ లేకపోవడంతో ప్రస్తుతం వారు తీవ్రంగా నష్టపోయారు.

హడావిడిగా చేశారని రద్దు..

గత నవంబరులో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టింది. ఈ క్రమంలో గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని హడావిడిగా తీసుకువచ్చారని, బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను లబ్ధిదారులుగా ఎంపిక చేశారని ఆరోపిస్తూ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసింది. ఆ పథకం స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇళ్లు, రూ.5 లక్షలు, స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, అదేవిధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో గత ప్రభుత్వ హామీతో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కొందరు ఉన్న చిన్నపాటి రేకుల ఇళ్లతో పాటు పూరిగుడిసెలను తొలగించుకున్నారు. తమ వద్ద ఉన్న కొంతడబ్బుతో పాటు ప్రభుత్వం అందించే రూ.3 లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టాలని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అలా మొదలైన ఇళ్లు మధ్యలోనే ఆగిపోయాయి. తప్పని పరిస్థితుల్లో కొందరు అప్పులు చేసి ఇంటి నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. గృహలక్ష్మి పథకం డబ్బులు వస్తాయని ఉన్న గుడిసెను పోగొట్టుకుని కొందరు, అప్పుల పాలై కొందరు లబోదిబోమంటున్నారు.

గృహలక్ష్మి వస్తదని ఉన్న ఇల్లు కూల్చిన

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో నాకు ఇల్లు వచ్చింది. దీంతో గతంలో ఉన్న ఇంటిని కూల్చి, పనులు మొదలు పెట్టా. ఈ లోపు ప్రభుత్వం మారింది. నాకు ఒక్క రూపాయ రాలేదు. అప్పు తెచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్న. ఇందిరమ్మ ఇళ్లు పథకంలోనైనా గత ప్రభుత్వంలో ఎంపిక చేసిన తమకు న్యాయం చేయాలి.

\- పల్లేటి విజయ, గుంజలూరు, గృహలక్ష్మి లబ్ధిదారురాలు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

గృహలక్ష్మి పథకం ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పథకంలో సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల విషయంలో తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత తెలియజేస్తాం.

\- చక్రాల సంతోష్‌కుమార్, ఎంపీడీవో, చివ్వెంల మండలం.

90 శాతం బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చారు

గృహలక్ష్మి పథకాన్ని మండలంలో ఎలక్షన్ ముందు హడావుడిగా ప్రారంభించి, కాంగ్రెస్‌లో ఉన్న కార్యకర్తలను, నాయకులను బెదిరించి, ఇళ్ల పేరుతో మభ్యపెట్టి ఆ పార్టీలో చేరుకున్నారు. 90శాతానికి పైగా బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇల్లను మంజూరు చేశారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసింది, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం సాయం చేస్తుంది.

\- పఠాన్ సమీర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, చివ్వెంల.

కనీస వసతులు కరువైన రైతు వేదికలు

మోత్కూరు, ఏప్రిల్ 7: గత ప్రభుత్వం అట్టహాసంగా నిర్మించిన రైతువేదికల్లో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. రూ.22 లక్షల వెచ్చించినా కనీసం మూత్రశాల, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించలేదు. దీంతో అందులో పనిచేసే సిబ్బంది, సమావేశాలు జరిగినప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



పాటిమట్ల రైతువేదిక వద్ద అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి నిర్మాణం

ఉమ్మడి జిల్లాలో 314 రైతు వేదికలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 314 రైతువేదికలు నిర్మించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 92, సూర్యాపేట జిల్లాలో 82, నల్లగొండ జిల్లాలో 140 రైతువేదికలు నిర్మించారు. కొన్నిచోట్ల మూత్రశాల, మరుగుదొడ్డి సౌకర్యం లేదు. కొన్నిచోట్ల మరుగుదొడ్డి కోసం గోడలు పెట్టి పైన శ్లాబ్ వేసినప్పటికీ వాటికి తలుపులు లేవు. లోపల బేసిన్, నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో రైతువేదికల్లో విధులు నిర్వహించే ఏఈవోలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. సమావేశాలు జరిగినప్పుడు రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏఈవో కార్యాలయ గది కిటికీలకు డోర్లు లేవు. ఏఈవోలు ఫ్లెక్సీలు అడ్డుపెట్టుకుంటున్నారు. మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలోని రైతువేదిక వద్ద మూత్రశాల, మరుగుదొడ్డి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. అనాజిపురంలో లోపల రూమ్‌లో బేసిన్ లాంటివి అమర్చినా బయట డోర్ లేదు. నీటి సౌకర్యం లేదు. ఇలానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా రైతులు వేదికల్లో కనీస మౌళిక వసతులు లేవన్న విమర్శలు ఉన్నాయి.

బిల్లులు సక్రమంగా ఇవ్వకపోవడంతో....

రైతువేదికల కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో నిర్మాణాలు సక్రమంగా జరుగలేదంటున్నారు. ప్రతిపాదనలో నిర్మాణాలు పూర్తి చేయకపోయినా కొన్నిచోట్ల పూర్తి చేసినట్లు బిల్లులు తీసుకున్నారని, మరికొన్నిచోట్ల కొంతబిల్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. నూతన ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి నిధులు దుర్వినియోగం అయిన చోట రికవరీ చేసి పనులు పూర్తి చేయించాలని, బిల్లులు పూర్తిగా చెల్లించని చోట వెంటనే మౌళిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏఈవోలు, రైతులు కోరుతున్నారు.

యాదగిరికొండపై భక్తుల సందడి





దేవదేవుడి దర్శనంకోసం ఆలయ క్యూలైన్లలో వెళుతున్న భక్తులు, ప్రధానాలయంలో నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 7: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కొండపై సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. వీఐపీ టికెట్ దర్శనానికి అర గంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టింది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో కూడా భక్తుల సందడి నెలకొంది. ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో ఆలయ ఉత్తర దిశలో బిగించిన షెడ్డు కింద భక్తులు సేదతీరారు. స్వామివారికి నిజాభిషేకం తదితరాల వంటి వాటికి వినియోగించే నీరు బయటకు వెళ్లలేక నిలిచిపోతుండగా వైటీడీఏ అధికారులకు ఈవో భాస్కరరావు తగు సూచనలు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 40,32,766 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహా నివేదన, శయనోత్సవాలతో ద్వారబంధనం చేశారు.



తూర్పుగోపురం ఎదుట భక్తుల సందడి

వలస కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో శుక్రవారం రాత్రి వలస కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన కబీరాజ్(32) అంకిరెడ్డిగూడెం పరిధిలోని ఓ పరిశ్రమలో నాలుగు నెలలుగా పనిచేస్తున్నాడు. పరిశ్రమ పరిధిలోని గదిలో కబీరాజ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గుర్తించిన కార్మికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గరిడేపల్లి, ఏప్రిల్ 7: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండలో విద్యుదాఘాతంతో ఆదివారం గేదె మృతి చెందింది. వెలిదండకు గ్రామానికి చెందిన రైతు గండు వెంకటి రోజు మాదిరిగానే గేదెలను మేతకు ఊరి పొలాలకు తీసుకెళ్లాడు. గేదె విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని రైతు వెంకటి కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రామన్నపేట, ఏప్రిల్ 7 : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట పోలీసులు తెలిపారు. మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన పొట్టేటి భిక్షం మార్చి 24న ఇంటి నుంచి తప్పిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తప్పిపోయిన వ్యక్తి సుమారు 65 ఏళ్ల ఉంటాడని భిక్షాటన చేస్తూ జీవిస్తూ ఉంటాడని ఆచూకీ తెలిసిన వారు 8712662487 నెంబర్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

కల నెరవేరినా.. సమస్య తీరలే

● డిప్యుటేషన్ అధికారులతోనే ఆర్డీవో కార్యాలయ సేవలు ● కార్యాలయంలో వసతులు అంతంతే ● పనులు కాక ప్రజలకు ఇబ్బంది

చండూరు, ఏప్రిల్ 7: పరిపాలన సౌలభ్యం కోసం చండూరును నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు 2023 సెప్టెంబరు 4వ తేదీన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేటి పాలకులు ఆ కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఒకటి కాదు రెండు కాదు పదుల ఏళ్లుగా ప్రజలు ఎదురు చూసిన రెవెన్యూ డివిజన్ కల నెరవేరినా, పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా ప్రజల సమస్యలు తీరలేదు. మునుగోడు ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే చండూరు, మునుగోడు, గట్టుప్పల, మర్రిగూడ, నాంపల్లి మండలాలను కలుపుతూ చండూరు మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని గతేడాది అక్టోబరు 4వ తేదీన నాటి మంత్రి జగదీష్‌రెడ్డి ప్రారంభించారు. నేటికీ ఆ కార్యాలయంలో ఒక్కటంటే ఒక్కటి కూడా రెగ్యూలర్ పోస్టును ప్రభుత్వం కేటాయించలేదు. దీంతో ప్రజలకు సేవలు అందనంత దూరంగా ఉన్నాయి.

పనులు కాక ప్రజలకు తిప్పలు

తహసీల్దార్ కార్యాలయంలో పని జరగని పక్షంలో అప్పీలు కోసం ఆర్డీవో కార్యాలయానికి వెళ్తారు. అలాగే నాలా దరఖాస్తులు, భూ వివాదాలు, కోర్టు కేసులతో పాటు, ఆలస్యంగా మరణ, జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఈ ఆర్డీవో కార్యాలయ తులుపు తట్టక తప్పదు. ఆ ఆర్డీవో కార్యాలయంలో ప్రస్తుతం డిప్యుటేషన్లపై ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు అటెండర్లు, ఒక రికార్డు అసిస్టెంట్‌లు విధులు నిర్వహిస్తున్నారు. కనీసం నైట్ వాచ్‌మెన్ కూడా లేరు. ఆర్డీవో పోస్టు కూడా డిప్యుటేషన్ పైనే కేటాయించారు. ముఖ్యంగా అడ్మినిస్ట్రేషన్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఆర్డీవో కార్యాలయం పరిధిలో చండూరు, గట్టుప్పల, మర్రిగూడ, నాంపల్లి, మునుగోడు మండలాలు ఉన్నాయి. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఆర్డీవో కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు.



చండూరులోని ఆర్డీవో కార్యాలయం

సొంత భవనం లేక...

పట్టణంలో నిరుపయోగంగా ఉన్న స్త్రీశక్తి భవనానికి రూ.10లక్షలు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేసి ఆర్డీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో మౌలిక వసతులు లేకపోవడంతో సిబ్బందికి తిప్పలు తప్పడంలేదు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం ఖాళీ సీసాలు అక్కడే వదిలేయడంతో, కార్యాలయంలో పనినిమిత్తం వచ్చే వారికి ఇబ్బందిగా మారుతుంది. ఉన్న సిబ్బందితోనే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామనిఆర్డీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.

నిధులు ఫ్రీజింగ్.. నిలిచిన ఫాగింగ్

● దోమల మందు పిచికారీకి డబ్బులు కొరత ● దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 7: దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన గ్రామపంచాయతీలు నిధుల లేమితో చోద్యం చూస్తున్నాయి. అసలే వేసవి కాలం ఆపై ఎండలు మండిపోతుండటంతో రాత్రివేళ ఇంటి బయట ఆవరణలో నిద్రించాలనుకునే వారికి దోమల బెడద నిద్రపట్టకుండా చేస్తోంది. దోమల నివారణకు చేయాల్సిన ఫాగింగ్‌కు నిధుల ఫ్రీజింగ్ అవరోధంగా మారిందని తెలుస్తోంది. మాడ్గులపల్లి మండలంలో ఇటీవల అంతుచిక్కని వ్యాధి బారిన పడి గ్రామస్థులంతా అనారోగ్యానికి గురయ్యారు. నీటికలుషితం వల్ల అయ్యిందా..? లేక దోమకాటు వల్ల ప్రబలిందా..? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. కానీ బాధిత గ్రామస్థులు మాత్రం అంతుచిక్కని వ్యాధి బారిన పడి ఒళ్లంతా నొప్పులతో కొన్ని రోజుల పాటు అవస్థలు పడ్డారు. ప్రజారోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి బాధిత గ్రామస్థులకు చికిత్స అందించింది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో కూడా ఇలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి అధికారులకు సూచించింది. నిధులు అందుబాటులో లేకపోవడంతో గ్రామ పంచాయతీలు నివారణ చర్యలను వేగవంతం చేయలేకపోతున్నాయి.

డబ్బులు లేక ఆగిన ఫాగింగ్

ప్రస్తుతం గ్రామ పంచాయతీల నిధులు నీటి అవసరాలకే తప్ప ఇతరత్రా ఉపయోగించడానికి అనుమతి లేదు. దీంతో ఫాగింగ్ చేయడానికి గ్రామ పంచాయతీలకు నిధులు అందుబాటులో లేవని తెలుస్తోంది. నిధులు డ్రా చేయకుండా ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించడంతో అత్యవసర పనులే తప్ప మరే ఇతర పనులకు నిధులు అందు బాటులో లేవని తెలుస్తోంది. ఉదాహరణకు నార్కట్‌పల్లి పట్టణంలో ఫాగింగ్ చేయాలంటే కనీసం రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని సిబ్బంది చెబుతున్నారు. గ్రామ పంచాయతీలో ఉన్న ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు రావడంతో ఎల్‌బీనగర్ నుంచి ఫాగింగ్ చేసే వ్యక్తులను ప్రత్యేకంగా పిలిపించి చేయాల్సి ఉంది. ఫాగింగ్ చేసినందుకు వీరికి సుమారు రూ.10వేలు, డీజిల్, కెమికల్, పెట్రోల్ వాడకానికి మారో రూ.15వేలు వెచ్చించాల్సి ఉంది. నిధులు అందుబాటులో లేకపోవడంతో ఫాగింగ్ చేయలేకపోతున్నట్లు తెలిసింది.



నార్కట్‌పల్లి గ్రామపంచాయతీలో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ మెషిన్

దోమల బెడదను నివారించాలి

నార్కట్‌పల్లిలో దోమల బెడద విపరీతంగా పెరిగింది. రాత్రివేళ కరెంటు సరఫరాలో అంతరాయమేర్పడినపుడు ఆరుబయట నిద్రించాలనుకుంటే దోమలు కాటేస్తున్నాయి. బయటకు వస్తే దోమలతో ఇబ్బంది పడుతున్నాం.

● చొల్లేటి ఓం ప్రకాశ్, నార్కట్‌పల్లి .

రెండు రోజుల్లో ఫాగింగ్ చేయిస్తాం

దోమల బెడద నివారణకు చర్యలు చేపడతాం. రెండు రోజుల్లో ఫాగింగ్ చేయిస్తాం. ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. వేసవి కారణంగా ప్రస్తుతం నిధులు అత్యవసరంగా నీటి అవసరాలు తీర్చేవాటికి వినియోగించాల్సి ఉంది. అధికారుల అనుమతితో ఫాగింగ్ చేయిస్తాం.

● సుధాకర్, ఎంపీవో.

బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ నాయకుడు సూర్యప్రకాష్

చిట్యాల, ఏప్రిల్ 7: పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ కోరారు. చిట్యాలలో జరిగిన ఆదివారం బీఎల్ఎఫ్, భాగస్వామ్య పక్షాల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాడుతున్నామన్నారు. బీఎల్ఎఫ్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి నూనె వెంకటస్వామిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి వస్కుల మట్టయ్య, ఎస్‌కె షరీఫ్, పోతుగంటి కాశీ, కోట జైపాల్‌రెడ్డి, షైనం నరేష్, బైరు వెంకన్న, గుణగంటి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా గణేశ్



నార్కట్‌పల్లి, ఏప్రిల్ 7: బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నార్కట్‌పల్లికి చెందిన మునుకుంట్ల గణేశ్ నియామకమయ్యారు. పార్టీ జిల్లా కమిటీ ఆదివారం నియామక ఉత్తర్వులు ఇచ్చింది. తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనుకు గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌యాదవ్

దేవరకొండ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవరకొండకు చెందిన నేతాళ్ల వెంకటేష్‌యాదవ్ నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ, సంఘం నాయకులకు వెంకటేష్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం, ఏప్రిల్ 7: మండలంలోని గురజాల జడ్పీ హైస్కూల్‌లో 1988-89 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. సుమారు 35ఏళ్ల తర్వాత ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు మారం సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు టి. యాదగిరి, పోషణాచారి, మారం విద్యాసాగర్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, కుర్రె యాదగిరిని సన్మానించారు. కార్యక్రమంలో గుండా రాంబాబు, వేముల వెంకన్న, గూని గంగరాములు, తాండ్రాల బిక్షయ్య, కస్తూరి పరుశరాములు, సంకటి శంకరయ్య, రామసాని వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి : మంత్రి

శాలిగౌరారం, ఏప్రిల్ 7: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కోరారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివేముల గ్రామానికి వెళ్తున్న మంత్రికి శాలిగౌరారం మండలం పెర్కకొండారం జాతీయ రహదారి వద్ద కాంగ్రెస్ నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జడ్పీటీసీ ఎర్ర రణీల యాదగిరి, దండ అశోక్‌రెడ్డి, గన్నపురెడ్డి, భిక్షంరెడ్డి, శానాల యుగేంద ర్‌రెడ్డి, బండపెల్లి కొమరయ్య, దేవరకొండ శంకర్, పెరుమాళ్ల ఉషాన్, మాచర్ల శ్రీరాములు, మన్నెం వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలి

వేములపల్లి, ఏప్రిల్ 7: గ్రామీణ ప్రాంతాల్లో మిషన్‌భగీరథ తాగునీటిని ప్రతిరోజూ సరఫరా చేయాలని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో కొద్ది రోజులుగా మిషన్ భగీరథ సరఫరా కాకపోవడంతో గ్రామంలోని మహిళలతో కలిసి ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే మిషన్‌భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఫ్లోరైడ్ రహిత జలాలు నిత్యం సరఫరా చేస్తామని కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన మిషన్‌భగీరథ నీటి సరఫరా లేక వృథాగా మారిపోతుందన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి తాగునీరు లేక గ్రామీణ ప్రజలు అల్లాడుతుంటే సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం మాత్రం పల్లెల వైపు చూడకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బారి వెంకన్న, అంతమ్మ, మల్లమ్మ, సోమమ్మ, సైదమ్మ, వెంకటమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మొల్కపట్నం గ్రామ మహిళలు

పూలే, అంబేడ్కర్ జన జాతరను జయప్రదం చేయాలి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 7: పూలే, అంబేడ్కర్ జన జాతరను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున కోరారు. మహనీయుల జయంతిని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరం, సెమినార్ కరపత్రాన్ని జిల్లాకేంద్రంలో ఆదివారం ఆవిష్కరిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజిక విశ్లేషకుడు అంబటి నాగయ్య, డాక్టర్ ధరణిధర్, టీఎన్జీవో కార్యదర్శి మురళి, శేఖర్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎడ్ల సైదులు పాల్గొంటారని తెలిపారు. సేకరించిన రక్తాన్ని నల్లగొండ ప్రభుత్వా ఆసుపత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గాదె నరసింహ, ఒళ్ళ రవీందర్, నాయకులు రవి, సుదర్శన్, ప్రభాకర్, జనార్దన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

దేశ సమగ్రత కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి

దామరచర్ల, ఏప్రిల్ 7: దేశ ప్రజల సమగ్రత కోసం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమానంగా పంచే ందుకు కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో న్యాయపత్రాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ విడుదల చేశారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని మరిచి దేశ సంపదను కొందరి చేతుల్లో పెట్టి బహుజనులను మరిచారన్నారు. అధికార మదంలో ఫోన్లను ట్యాప్ చేసిన బీఆర్ఎస్‌కు దళిత, బహుజనులు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోకల రవి, పాదిల శ్రీనివాస్, ధీరావత్ మోహన్‌నాయక్, శివ, చరణ్, నసర్ల అశోక్, రాజేష్, నాగునాయక్, రాంరెడ్డి, రవీందర్, గాంధీ, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

కాంగ్రెస్ జాతీయ గ్యారెంటీకార్డు పేదలకు వరం

మిర్యాలగూడ, ఏప్రిల్ 7: కాంగ్రెస్ జాతీయ గ్యారెంటీ కార్డు పేదలకు వరమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన సమాచార మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్య సమాజ్‌మందిర్‌లో సమాచారహక్కు సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పేదల సంక్షేమానికి తోడ్పడింది కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. సంక్షేమ పథకాలు, పాలనలో జవాబుదారితనం కల్పించి పారదర్శకంగా ఉండేందుకు దేశంలో సమాచారహక్కు చట్టాన్ని తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. నెహ్రూ పాలనలో దేశ ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు రచిస్తే, ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణతో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాజీవ్‌గాంధీ దేశానికి తొలిగా టెక్నాలజీని పరిచయం చేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం సాహోసపేత నిర్ణయం, దేశానికి గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను దేశ ప్రజలు మరవులేరన్నారు. దేశంలో బహుళ జాతుల సంస్కృతీ, లౌకికవాదం, సమానత్వం రక్షించాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. ఆర్టీఐ చట్టం సామాన్యులకు గౌరవం పెంచిందన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లను త్వరలో నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. సహ చట్టం ద్వారా అవినీతిని వెలికితీయాలన్నారు. ఆర్టీఐ కార్యకర్తలు, మేధావులు, విద్యావంతులు ముందడుగు వేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే పాలనాపరమైన నిర్ణయాలు అభినందనీయమన్నారు. సమాచార వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం. రామ్‌చంద్రారెడ్డి, ఎండి.ఖలీమ్, చిత్రం శ్రీనివాస్, ఎం. సతీష్‌కుమార్, వై.హేమలత, మూల శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సంక్షిప్త సమాచారం..

దేవరకొండ: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, థెస్సా ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉగాది క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకొని డివిజన్ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, థెస్సా అధ్యక్షుడు పర్సా వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని కవులు, రచయితలు, ఈనెల 9 ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనానికి హాజరుకావాలని కోరారు.

దేవరకొండ: దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లిలో డబుల్‌బెడ్ రూం ఇళ్లకు డ్రా పద్ధతిలో ఎంపిక చేసిన 60మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2023 నవంబరులో పెంచికలపహాడ్ వద్ద డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు 60మందిని ఎంపిక చేశారని తెలిపారు. జాబితాలో పేర్లు ప్రకటించినా ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని పేర్కొ న్నారు. బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమేశ్‌చారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని ఆయన కోరారు.

మిర్యాలగూడ టౌన్: ముస్లిం మత పెద్ద మౌలానా అతిక్కుల్ రెహ్మాన్‌కు మైనార్టీ యువత స్కూటీ బహూకరించారు. రంజాన్ మాసాంతం ఖురాన్ పఠిస్తూ మసీదులో సేవలందించినందున స్కూటీ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జావీద్, ఉస్మాయిల్, మర్కజ్‌పాషా, అజహర్, షఫీ, సాజిద్‌ఖాన్, అకీబ్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణానికి చెందిన భక్తులు వేంకటేశ్వరుని సేవకు తరలివెళ్లారు. స్వామివారి దర్శనానికి దేశ నలుమూలల నుంచి సన్నిధానికి వచ్చే భక్తులకు పక్షం రోజుల పాటు సేవలందించనున్నట్లు తెలిపారు. 46మంది మూడు బృందాలుగా తిరుమలలో సేవలందించనున్నారు. తరలివెళ్లిన వారిలో కీర్తి అశోక్, చీదళ్ల నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మీ, రాజారాం, సన్నీ, శ్రీనివాస్, లక్ష్మీ ఉన్నారు.

కట్టంగూరు: కట్టంగూరుకు చెందిన సిద్దగోని మల్లికార్జున్‌ను బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు ఆదివారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు మల్లికార్జున్ కృతజ్ఞతలు తెలిపారు.

చిట్యాల రూరల్: మండలంలోని సుంకెనపల్లి-గుండాంపల్లి మాజీ ఎంపీటీసీ మర్రి వెంకటేశం ప్రథమ వర్ధంతి ఆదివారం సుంకెనపల్లిలో నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ పాల్గొని వెంకటేశం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవుల యాదయ్య, దుబ్బ పద్మకుమారస్వామి, రామచంద్రం, స్వామి, మధు, ఐలయ్య, నర్సింహ, లింగస్వామి, శంకరయ్య, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

కనగల్: కనగల్ గ్రామంలోని శాఖ గ్రంథాలయానికి ఏవీ రంగారావ్ ఫౌండేషన్ ప్రతినిధి కనగల్ గ్రామానికి చెందిన అక్కినేపల్లి శ్రీనివాస్‌చక్రవర్తి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తక మెటీరియల్‌ను గ్రంథాలయ అధికారి కుసుమకు ఆదివారం గ్రంథాలయంలో అందజేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువకులు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్‌చక్రవర్తి కోరారు.

శుభ, అశుభ కార్యాలకు దిక్సూచి పంచాగం



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 7: శుభ, అశుభ కార్యాలకు దిక్సూచి పంచాంగమని బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ, భక్తాంజనేయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గింజమూరి సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్జాలబావి ఇందిరమ్మ కాలనీలో ఆదివారం జరిగిన శ్రీక్రోధి నామ సంవత్సర సప్త వార్షికోత్సవ పంచాంగ కార్యక్రమంలో మాట్లాడారు. పంచాంగం అనేది మంచి, చెడులను తెలిపేది అని, ప్రతి ఒక్కరూ పంచాంగం ప్రకారమే పనులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో భక్తాంజనేయ స్వామి సేవా సంస్థ అధ్యక్షుడు సిరిపగడ శ్రీనివాస్‌శర్మ, వసంత, రుద్రాక్షి నర్సింహ్మ, ఆకెల శ్రీనివాస్, గాదె కిరణ్‌కుమార్, దామోదర్, పెన్న జయప్రద, భరత్‌కుమార్, మేడి హరికృష్ణ, రాంబాబు తదితరులు ఉన్నారు.

సత్యనారాయణకు వాస్తు బ్రహ్మ అవార్డు



మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 7: పట్టణానికి చెందిన వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ వాస్తు బ్రహ్మ అవార్డు అందుకున్నారు. విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఏపీలోని రాజమండ్రిలో జరిగిన వైదిక జ్యోతిష సమ్మేళనంలో పురస్కారం అందుకున్నారు. దైవాజ్ఞ రత్న, బహుగ్రంథ రచయిత పుచ్చా శ్రీనివాసరావు, కంచి రామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి లక్కావజ్ఝల విజయసుబ్రహ్మణ్యం నుంచి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా బుగ్గ లక్ష్మీనర్సింహ్మస్వామి రథోత్సవం



రథోత్సవం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మర్రిగూడ, ఏప్రిల్ 7: మండలంలోని అజలాపురంలో బుగ్గ లక్ష్మీనర్సింహ్మ స్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనం నిర్వహించారు. అంతకు ముందు భక్తులు లక్ష్మీనర్సింహ్మ స్వామికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఏడుదొడ్ల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు దండేర్కర్ అంజయ్య, లాలునాయక్, రామిడి వెంకటరమణరెడ్డి, అజిత్‌రెడ్డి, మల్లేష్, అమరేందర్‌రెడ్డి, యాదగిరి, రామిడి నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా సలీం



మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 7: నల్లగొండ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ సెల్ పరిశీలకుడిగా పట్టణానికి చెందిన ఎంఏ. సలీం నియమితులయ్యారు. ఏఐసీసీ (మైనార్టీ విభాగం) వైస్‌చైర్మన్ ఫర్హాన్ ఆజ్మీ ఉత్తర్వులు జారీ చేశారు. మైనార్టీలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేచ్చేందుకు కృషి చేస్తామని సలీం తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 7: తెలంగాణ ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 2,325 విద్యార్థులకు గాను 1767మంది హాజరయ్యారు. 558మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి పలు కేంద్రాల్లో సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు.

బుచ్చిరెడ్డికి ఉగాది పురస్కారం

చండూరు, ఏప్రిల్ 7: చండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి ఉగాది పురస్కారం లభించింది. రెడ్డి గర్జన సామాజిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి నుంచి పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి తోపాటు రచనా రంగంలో చేస్తున్న కృషికి పురస్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంకెనపల్లి సుధీర్‌రెడ్డి, నావల్ల సత్యనారాయణ, సంతోష్‌రెడ్డి, సుమతి, శ్రీలక్ష్మీ, వసంతరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పాపిరెడ్డి ఉన్నారు.

కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలి

గుర్రంపోడు, ఏప్రిల్ 7: మండలకేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సప్తమ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ జాల పెద్దసత్తయ్యయాదవ్ కోరారు. దేవాలయ ప్రాంగణంలో జాతరలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఏప్రిల్ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆలయ బ్రహ్మోత్సవ నిర్వహించనున్నట్లు తెలిపారు. 13వ తేదీన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన, స్వామి వారి కల్యాణ మహోత్సవం, 14వ తేదీన బొడ్రాయి మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గాలి సరిత రవికుమార్‌గౌడ్, జాల చిన్న సత్తయ్యయాదవ్, మాజీ సర్పంచ్ మస్రత్‌సయ్యద్‌మియా, కుప్ప అమరేందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ లాలయ్య, దేవాలయ వైస్ చైర్మన్ వెలుగు బిక్షం, రావుల సైదులుగౌడ్, మేడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు